**కథ**

# తృప్తి

**దుర్భేద్యమైన కోటని కాపలా కాసే వీరయోధుల్లా దృఢంగా, బలంగా ఇంటి ముందర పెరిగిన కొబ్బరిచెట్లు, శాఖోపశాఖలై విస్తరించి ఆయురారోగ్యాలనే ఆశీస్సులు అందిస్తున్న వృద్ధమాత లాంటి వేపచెట్టు, ఈశాన్యంలో మంచినీటి బావి, బావి అంచుని ఆనుకుని విరగకాసిన దబ్బకాయలతో పిల్లల తల్లిలా ఉన్న దబ్బచెట్టు వెరసి ప్రకృతి పచ్చదనం అంతా ఆ ఇంటి పరిసరాల్లోనే కాదు, ఆ పచ్చదనం తాలూకు స్వచ్ఛత కూడా ఆ ఇంటి వారి మనసుల్లో నిండి ఉంది. అందుకు కారణం ఆ ఇంటి యజమాని నరసింహం, ఆయన భార్య శ్రీవిద్య.**

నరసింహం కష్టజీవి. ఉన్నంతలో తోటివారికి సాయపడాలనే సామాజిక స్పృహ ఉన్నవాడు.

నరసింహం ఆస్తికుడు కాదు. అలాగని నాస్తికుడూ కాదు. ఆపదలో ఉన్నవారికి చేతనైన సాయం చేయడమే నిజమైన పూజ అని ఆయన నమ్మకం. నైతిక విలువలులేని చదువు ఆర్థికస్తోమత నిచ్చినా, ఆత్మతృప్తినివ్వలేదని నమ్మినవాడు కనకే తన పిల్లలకి 'ట్వింకిల్... ట్వింకిల్' లాంటి రైమ్స్ తోపాటు 'ఉపకారికి ఉపకారం' లాంటి నీతి పద్యాలనెన్నింటినో అర్థంతోసహా కంఠస్థం చేయించాడు. పిల్లలు ఎదిగి పెద్ద హోదాలో ఉన్నప్పుడు ఏ ప్రలోభాలకీ లొంగకుండా ఉండడానికి ఇది ముందు జాగ్రత్త చర్య అని ఆయన ఉద్దేశం.

ఆయన భార్య శ్రీవిద్య దైవభక్తి పరాయణురాలు. రోజులో మూడు వంతులు పూజ, పునస్కారాలతోటే గడచిపోతుందావిడకి. ప్రతి రోజు ఉదయాన్నే లేచి పనులు ముగించుకుని గుడికి వెళ్లడం ఆమె దినచర్యలో ఓ భాగంగా మారింది.

నరసింహానికి ఇద్దరు కొడుకులు. ఒక కూతురు. పెద్దకొడుకు డాక్టరు. ఫారిన్‌లో ఉంటాడు. రెండో కొడుకు ఇంజనీరు. బాంబేలో ఉద్యోగం చేస్తున్నాడు. పిల్లలందరికీ పెళ్లిళ్లయి ఉద్యోగాల్లో స్థిరపడ్డాక ఆ వృద్ధదంపతులు మాత్రం సొంత ఇంట్లోనే ఉంటున్నారు.

★ ★ ★

''నేనలా గుడికి వెళ్లొస్తాను తలుపేసుకోండి'' పూలు, పళ్లు ఓ ప్లాస్టిక్ బుట్టలో పెట్టుకుని బయల్దేరబోతూ అన్నది శ్రీవిద్య.

''ఓహో నీ గుడికి వేళయినట్టుంది కదూ! పాపం నీ దేవుడికి కూడా నాలాగే చెప్పింది వినడం, పెట్టింది తినడమే కానీ ఎదురు చెప్పడం అలవాటు లేదులే'' నవ్వుతూ అన్నాడు నరసింహం.

''చాల్లెండి వేళాకోళానికి దేవుడే దొరికాడా మీకు. జీవితపు మలిసంధ్యలో ఉన్నవాళ్లం. కృష్ణారామా అనుకునే వయసు. ఇప్పుడైనా ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలనే ధ్యాసలేదు'' చిరుకోపంతో అంది శ్రీవిద్య.

''మానవసేవే మాధవసేవ. ముక్కు మూసుకుని జపం చేసుకోడం కన్నా సాటి మనిషి కష్టాల్లో పాలుపంచుకోవడం మిన్న'' నస్యం పీలుస్తూ అన్నాడు నరసింహం.

''సర్లెండి ఇలాంటి ఉపన్యాసాలెన్నయినా ఇస్తారు కానీ ఆ పాడు అలవాటు మానుకోరు. ఇల్లంతా నస్యం వాసనే''

''ఇది మన పెళ్లికి ముందు నుంచే ఉన్న అలవాటు. ఈ అలవాటు గురించి మన పెళ్లికి ముందే చెప్పాను. అప్పుడేమీ అబ్జెక్షన్ పెట్టలేదు. బహుశా పతివ్రతా స్త్రీలలాగా ఓర్పుతో నేర్పుతో ఈ అలవాటు మాన్పించవచ్చులే అనుకుని వుంటావు. అవునా?''

శ్రీవిద్యకి నవ్వొచ్చినా ముఖం సీరియస్‌గానే పెట్టి అంది-

''పోనీ నాకోసం కాదు, మీ ఆరోగ్యం దృష్ట్యా మానుకోవచ్చుగా. డాక్టరుగారు కూడా చెప్పారు కదా నస్యం పీల్చడం వల్ల లంగ్స్ పాడవుతాయని''

''ఆ డాక్టర్లు అలాగే చెబుతారు. వాళ్లు మాత్రం సిగరెట్లు తాగరా? మందు పార్టీలు చేసుకోరా? అయినా నువ్వన్నావు కాబట్టి చెబుతున్నాను. ఈ ఎనభయ్యో పడిలో పడ్డ నేను ఆరోగ్యసూత్రాలు పాటిస్తూ ఎంతకాలం బతకాలిట. పోయే రోజు కూడా ఈ చిన్న అలవాటు తీర్చుకునే పోతాను. తెలిసిందా?''

శ్రీవిద్య ఉలిక్కిపడింది. ''ఏమిటండీ అపశకునం మాటలు! మీరు నూరేళ్లూ హాయిగా ఉంటారు'' అంది బాధగా.

''త్వరగా గుడికెళ్లి రావోయ్. మళ్లీ వంట చెయ్యాలంటావు. అవునూ, వంట అంటే జ్ఞాపకమొచ్చింది. నువ్వు మొన్న చేసిన చింతపండు పచ్చడి ఉందా అయిపోయిందా?'' భార్యని ఉడికిస్తూ అన్నాడు నరసింహం.

''అది చింతపండు పచ్చడి కాదు, అల్లం పచ్చడి'' మళ్లీ కోపమొచ్చింది శ్రీవిద్యకి.

''అవును కదూ, మర్చేపోయాను. అందులో అల్లం వేయడం మర్చిపోయుంటావు''

''మీకలా నవ్వులాటగానే ఉంటుంది నా వంటంటే. మన పనిమనిషి అప్పాయమ్మ ఆ పచ్చడి బాగుందని మళ్లీ అడిగి మరీ తీసుకెళ్లింది'' అంది శ్రీవిద్య.

''అది పచ్చడి తీసుకెళ్లింది తిండానికి కాదు. నువ్వు తోమడానికి వేసిన ఇత్తడి బిందెకి వేరే చింతపండు అడగడమెందుకులే అని'' పెద్దగా నవ్వుతూ అన్నాడు నరసింహం.

ఎనభై ఏళ్లొచ్చినా భర్తలో తగ్గని సెన్సాఫ్ హ్యూమర్‌కి లోలోపల ఆనందించినా పైకి సీరియస్‌గా ముఖం పెట్టి- ''పోన్లెండి, నా వంట మీకు నచ్చకపోతే మీ అబ్బాయి దగ్గరకెళ్లండి. రోజూ స్టార్ హోటల్లో పెట్టిస్తాడు'' అంది.

''పాపం వాడికెందుకులే అనవసరపుఖర్చు. ఇన్నేళ్లు నీ చేతివంట తిన్లేదూ. అలాగే ఎలాగో తింటాలే మరి'' అన్నాడు నరసింహం. కానీ ఆ ఇంట్లో తను భోంచేసేది ఇంకొక్క రోజే అని ఆయనకు తెలియదు.

★ ★ ★

''రాను రాను నాన్నకి చాదస్తం ఎక్కువవుతోందమ్మా. లేకపోతే ఏమిటి నాతో బాంబే తీసుకెళతానంటే రాను పొమ్మంటారు. అక్కడ మనింట్లో నాన్నకీ, నీకూ స్పెషల్ రూం కట్టించాను మేడ మీద. టీవీ కొన్నాను. ఇంటర్‌నెట్ కనెక్షన్ తీసుకున్నా. బోలెడంత కాలక్షేపం. కాస్త నువ్వయినా నాన్నకి చెప్పి ఒప్పించు'' కొంచెం విసుగ్గా, బాధగా అన్నాడు చిన్న కొడుకు శ్రీను.

''అక్కడికొస్తే శరీరానికి హాయినిచ్చే ఆధునిక వసతులుండవచ్చు. కానీ కన్నతల్లి, జన్మభూమి ఎటువంటివో సొంతిల్లు కూడా అటువంటిదే. ఈ ఇంట్లో ఉన్న తృప్తి స్వర్గంలో కూడా దొరకదు. ఇది నా రెక్కల కష్టంతో కట్టుకున్న ఇల్లు. ఈ ఇంటి గోడలకున్న ప్రతి రాయికీ నా కష్టం తెలుసు'' అప్పుడే అక్కడికొచ్చిన నరసింహం అన్నాడు.

శ్రీనివాస్ మాట్లాడలేదు. వేలకి వేలు సంపాదిస్తూ పెద్ద రాజసౌధం లాంటి ఇంట్లో ఉంటూ

కూడా నిత్యం ఏదో టెన్షనూ, అసంతృప్తీ తనకి. ఏ ఆధునిక సౌకర్యాలు లేకపోయినా ఈ పాతకాలపు ఇంట్లో ఉంటున్నా నాన్న కళ్లలోని సంతృప్తీ! ఎక్కడుంది తేడా అనుకున్నాడు.

''అయితే నేను ఇంకెందుకూ ఇక్కడ. ఇవాళ రాత్రే బాంబే వెళ్లిపోతాను. మీ ఇద్దర్నీ నాతో తీసుకెళదామని ఎంతో ఆశతో వచ్చాను'' నిరాశగా అన్నాడు శ్రీనివాస్.

★ ★ ★

ఏ క్షణాన ఏమవుతుందో తెలియని గాలిబుడగ లాంటిది మనిషి జీవితం. అస్థిరమైన ఈ జీవితంలో ఏ క్షణం ఏ మలుపుకి నాంది పలుకుతుందో ఎవరికి తెలుసు?

నరసింహం జీవితంలో ఓ దురదృష్ట క్షణం గుండెనొప్పి రూపంలో వచ్చింది. వెంటనే ఆయనని హాస్పిటల్‌లో జాయిన్ చేశారు. ఇంటెన్సివ్ కేర్‌లో పెట్టి ట్రీట్‌మెంట్ ఇచ్చారు. నలభై ఎనిమిది గంటలు అబ్జర్వేషన్‌లో ఉంచాలన్నారు.

యవ్వనంలో సంసారసుఖాలతో స్వర్గాన్నందించిన శరీరం వయసు పెరిగి, జవసత్వాలు తగ్గాక మందులకి కూడా పనిచేయనని మొరాయిస్తుంది.

నరసింహం పరిస్థితిలో ఏ మార్పూ లేదు. ఊపిరి తీసుకోవడం కష్టమవుతూండడం వలన ఆక్సిజన్ మాస్క్ పెట్టారు. ఉండుండి రక్తపోటు ఎక్కువవుతోంది.

''ఆయన పక్కనే ఉండండి. ఇదే చివరి దశ కావచ్చు'' అన్నాడు డాక్టరు.

''నాన్నా'' తట్టి పిలిచాడు శ్రీనివాస్.

నరసింహం బలవంతంగా కళ్లు తెరిచి చూశాడు. ఏదో చెప్పబోయాడు కానీ నాలుక తడబడింది. స్వరపేటిక మూసుకుపోయింది.

బతికున్నన్నాళ్లూ వేల వేల మాటలు మాట్లాడిన మనిషి పోయే నిమిషంలో తనవారితో చివరగా ఓ మాట చెప్పడానికి మాట కోసం తడుముకుంటాడు. చివరి క్షణంలో ఏదో చెప్పాలని ప్రయత్నించిన నరసింహం ఆ మాట చెప్పకుండానే శాశ్వతంగా సెలవు తీసుకున్నాడు.

శ్రీనివాస్ భుజం మీద చేయి వేసి 'సారీ' చెప్పాడు డాక్టరు.

ముప్పై ఐదేళ్లుగా తండ్రితో పెంచుకున్న అనుబంధం శాశ్వతంగా తెగిపోయింది. ముగిసిపోయిన అంకం మళ్లీ మొదలవదు. గడచిపోయిన జీవితమూ అంతే. సుఖదుఃఖాలకు నిశ్శబ్ద సాక్షిగా కాలమలా సాగిపోతూనే ఉంది.

ఆరడుగుల నరసింహం శరీరం శాశ్వత విశ్రాంతి తీసుకుంటున్నట్టుంది. తెలిసిన వారూ, బంధువులూ వచ్చి చూసి వెళుతున్నారు.




''అయ్యో పాపం మంచి మనిషి'' అంటున్నారందరూ. ఆ మాట అనిపించుకుంటే చాలు. పోయినవాళ్ల జీవితం చరితార్థమైనట్టే.

''మీ నాన్న పాపం చాలా మంచి మనిషి. ఓసారి డబ్బు అవసరమై అడిగితే తన నిత్యావసరాలకి దాచిన డబ్బు తీసిచ్చాడు. కూరలు కొనడానికి డబ్బుల్లేక ఆ నెలంతా ఓ పూట కూర వండలేదుట మీ అమ్మ. మన అవసరాల కోసం దాచిన డబ్బు ఎందుకు అప్పు ఇచ్చారంటూ మీ నాన్నని నిలదీయలేదుట కూడా. భర్తకు తగిన భార్య'' నరసింహం మంచితనాన్ని గుర్తు చేసి మరీ బాధపెడుతున్నారు బంధుజనాలు.

''మృత్యువు మనిషికి దురదృష్టం కాదు. మనిషి పోయినందుకు ఏడవకూడదు. జీవితంలో ఏదీ

ఆదుర్తి బాల

సాధించకుండా పోతే అప్పుడు ఏడవాలి. ఎనభై ఏళ్ల సుదీర్ఘ జీవనపోరాటంలో ఆటుపోట్లు ఎదుర్కొంటూ మీ అందరినీ ఉన్నతస్థితికి తీసుకువచ్చాడు మీ నాన్న'' ఆప్యాయంగా శ్రీనివాస్ భుజం చుట్టూ చేయి వేస్తూ అన్నాడు రామ్మూర్తి బాబాయ్.

పెద్ద కొడుకు వచ్చేవరకూ ఐస్‌లో ఉంటారు నరసింహాన్ని. కబురు అందుకున్న పదిహేను గంటలకి చేరుకున్నాడు పెద్ద కొడుకు రవి. కొడుకులూ, కోడళ్లూ, కూతురు, అల్లుడు, బంధుజనాల మధ్య నరసింహం అంత్యక్రియలు జరిగాయి.

తండ్రి పోయిన బాధకన్నా, ఆయన చివరి క్షణాల్లో చెప్పాలనుకుని చెప్పలేకపోయిన విషయమేమిటి అన్నదే ఎక్కువ బాధిస్తోంది శ్రీనివాస్‌ని. కొడుకుగా ఆయన చివరి కోరిక తీర్చడం తన విధి. కానీ అది తనకు సాధ్యమవుతుందా? ఎలా తెలుసుకోవాలి?

పోనీ అమ్మని అడిగితే తెలుస్తుందేమోనని అడిగాడు. ఆమె కూడా తనకి తెలియదంది.

ఆరోజు-

కర్మకాండలు పూర్తయి వచ్చిన వాళ్లందరూ వెళ్లిపోయిన తర్వాత నాన్న పెట్టె తీసి సర్దడం మొదలుపెట్టారు ఆయన కొడుకులిద్దరూ. అప్పుడు కనిపించింది తండ్రి భావాలకీ, ఆలోచనలకీ ప్రతిరూపమైన డైరీ.

ఆతృతగా తీసి చదవడం ప్రారంభించాడు ఆయన పెద్ద కొడుకు రవి.

ఆ డైరీలో ఆయన రాసిన ఆఖరు పేజీలో ఓ పేపర్ కటింగ్ ఉంది. 'సాయం కోసం ఎదురుచూపు' అనే హెడ్డింగ్‌తో ఓ యువకుని ఫొటో, ఆ ఫొటోతోపాటు ఓ ప్రకటన. గుండెజబ్బుతో బాధపడుతున్న ఓ యువకుడు ఆర్థిక సాయంకోసం అభ్యర్థిస్తున్న ప్రకటన అది.

ఆర్థికసాయం అందించాల్సిన అడ్రస్ కింద అండర్‌లైన్ చేయబడి ఉంది.

ఆ ప్రకటన డేట్ చూశాడు ఆయన కొడుకు.

అది తన తండ్రికి గుండెనొప్పి వచ్చిన ముందు రోజు తారీఖు. డైరీలో ఆయన రాసిన చివరి పేజీ చదవసాగాడు చిన్న కొడుకు.

''పుట్టిన ప్రతి మనిషీ ఓ మదర్ థెరిస్సాలా సేవచేయలేకపోవచ్చు. ఓ గాంధీ మహాత్ముడు కాలేకపోవచ్చు. కానీ తనకున్న పరిధిలో తోటి మనిషిని ఆదుకోవడం ప్రతి మనిషి కనీస బాధ్యత. అదే మానవత్వం.

అది రక్తసంబంధం కన్నా బలమైనది. విస్తృతమైనది.

తల్లిదండ్రులు తమ ఆస్తిపాస్తులని బిడ్డలకి సంక్రమింపచేసినట్టే మానవత్వాన్ని కూడా అందించగలగాలి.

నిరంతర జీవధారలా ఒక తరం నుంచి తరువాత తరానికి మానవత్వం ప్రవహించిన నాడు విశ్వశాంతి వెల్లివిరుస్తుంది.

ఎనభై ఏళ్ల నా జీవిత ప్రయాణంలో తోటివారికి నాకు చేతనైనంతలో సేవ చేశాను. ఆ సేవాతత్పరతే నా బిడ్డలకూ సంక్రమించాలని నా చివరి కోరిక.

నా చివరి శ్వాస తీసేలోపు ఓ అభాగ్యుడిని ఆదుకోవాలనుంది.

కానీ రేపటి ఉదయం చూస్తానా అని ఎందుకో అనుమానంగా ఉంది''

ఆ డైరీ చదివిన శ్రీనివాస్ కళ్ల నుంచి రెండు అశ్రుబిందువులు రాలిపడ్డాయి.

మృత్యువుని సైతం సహజ ప్రక్రియలా స్వీకరించగలిగే తండ్రి మానసిక స్థైర్యం, ఆఖరి నిమిషంలో కూడా వీడని మానవత్వం అతడిని కదిలించి వేసింది. భౌతికంగా తండ్రి తన ఎదురుగా లేకపోయినా ఆయన రక్తం, ఆ జీన్స్ తనలో వున్నాయి. తండ్రి తనలోనే సజీవంగా ఉన్నాడనడానికి వేరే సాక్ష్యం ఏముంటుంది?

మనిషికి శాశ్వతత్వాన్నిచ్చేది డబ్బు కాదు. కీర్తిప్రతిష్ఠలు కూడా కాదు. అంతకుమించిందీ, ఈ సృష్టిలో మనిషికి మాత్రమే సాధ్యమయ్యేదీ, తండ్రి తమకి వారసత్వంగా సంక్రమింపచేయాలనుకున్నది...

నరసింహం పెద్ద కొడుకు ఆ పేపర్ కటింగ్‌లోని అడ్రస్ నోట్ చేసుకున్నాడు.

అతడికి వైద్య సహాయం చేస్తానని ముందుకొచ్చాడు.

తండ్రి పేరు మీద ఓ అనాథాశ్రమాన్ని కట్టించాలని చిన్న కొడుకు ఆ క్షణంలోనే నిర్ణయించుకున్నాడు.

తన బిడ్డల నిర్ణయాలకి నరసింహం ఆత్మ తృప్తిపడి పై లోకాలకి ఎగిరిపోయింది.

✤

## సుస్మిత కబుర్లు

**ప్రతి స్త్రీ తన జీవితంలోకి ఓ పురుషుడ్ని ఆహ్వానిస్తుంది. పెళ్లితో ఆ బంధం ప్రారంభమవుతుంది. అయితే కొంత మంది పెళ్లికి దూరంగా ఉండాలనుకుంటారు. మారుతున్న పరిస్థితుల్లో ఇలా ఆలోచించేవారి సంఖ్య బాగా పెరిగిపోతోంది. మాజీ విశ్వసుందరి సుస్మితాసేన్ ఇప్పుడు ఈ కోవలోకొచ్చింది. 'ఇప్పుడు నేనెంతో హేపీగా ఉన్నాను. నా పెంపుడు కూతురు ఆలనా పాలనతో ఆనందంగా జీవితాన్ని గడుపుతున్నాను. ప్రేమ అంటే ఏమిటో మా అమ్మాయి రేనీ నుంచి పొందుతున్నాను' అని చెబుతున్న సుస్మిత ఆత్మవిశ్వాసం ఉన్న స్త్రీలా కన్పిస్తోంది.**

